హెల్త్ సబ్‌సెంటర్లకు మోక్షమెప్పుడో?



ఇది దహెగాంలోని సబ్‌సెంటర్ భవనం. భవన నిర్మాణ పనులు ప్రారంభించి ఏడాదికి పైగా కావస్తున్నా ఇంకా పూర్తి కాలేదు. భవనం పూర్తి చేసి తలుపులు, కిటికీలు, రంగులు వేయాల్సి ఉంది. మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉండడంతో వైద్యం కోసం స్థానికులు అక్కడికి వెళ్తున్నారు. ఈ సబ్‌సెంటర్ పూర్తి కావడానికి ఇంకా ఎంత కాలం పడుతుందోనని స్థానికులు వాపోతున్నారు.



పునాది దశలో కనిపిస్తున్న ఈ నిర్మాణం హత్తిని గ్రామ సబ్‌సెంటర్ భవనం. పనులు ప్రారంభించి ఏడాది పూర్తయినా పనులు ముందుకు సాగడం లేదు. దీంతో గ్రామస్తులు సకాలంలో వైద్యం అందక ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర వేళల్లో వైద్యం కోసం వేరే చోటకు పరుగులు తీస్తున్నారు. భవన నిర్మాణం వెంటనే పూర్తి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

- పూర్తికాని నిర్మాణాలు
- పూర్తయిన చోట్ల వసతుల కల్పన కరువు
- పట్టించుకోని అధికారులు



బీబ్రా గ్రామంలో నేషనల్ హెల్త్ మిషన్ కింద నిర్మించిన సబ్‌సెంటర్ ఇది. ఆరు నెలల కిందట నిర్మాణం పూర్తి కాగా విద్యుత్, తాగునీటి వసతి కల్పించకపోవడంతో ఇంకా ప్రారంభించలేదు. దీంతో సకాలంలో వైద్య సేవలు అందక గ్రామీణులు ఇబ్బందులు పడుతున్నారు. భవన నిర్మాణంతో పాటు విద్యుత్, తాగునీరు వంటి వసతుల కల్పనకు నిధులు కేటాయించినా పనులు మాత్రం పూర్తి కాలేదు.

దహెగాం: గ్రామీణ ప్రాంతాల వారికి మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం నేషనల్ హెల్త్ మిషన్ కింద సబ్ సెంటర్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. మండలంలో ఏడు సబ్‌సెంటర్లు ఉండగా ఒక్కో భవన నిర్మాణానికి రూ. 16 లక్షలు, తాగునీరు, విద్యుత్ తదితర సౌకర్యాలు కల్పించడానికి మరో రూ. 4 లక్షలు కేటాయించారు. భవనాల నిర్మాణాలు ఏడాది క్రితం ప్రారంభించినా అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఇప్పటికీ పూర్తి కాలేదు. పూర్తయినా చోట వసతులు కల్పించక పోవడంతో ప్రారంభానికి నోచుకోవడం లేదు. మండలంలో ఏడు సబ్ సెంటర్ల నిర్మాణాలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది.

మండలంలో ఏడు సబ్‌సెంటర్లు..

మండల కేంద్రంతో పాటు, హత్తిని, పంబాపూర్, బీబ్రా, ఇట్యాల, కుంచవెల్లి, గిరవెల్లిలో సబ్ సెంటర్లు ఉన్నాయి. వీటికి పక్కా భవనాలు నిర్మించేందుకు నేషనల్ హెల్త్ మిషన్ కింద నిధులు మంజూరయ్యాయి. హత్తిని, పంబాపూర్ గ్రామాల్లో సబ్‌సెంటర్లు ఇంకా పునాది దశలోనే ఉన్నాయి. బీబ్రా, ఇట్యాలలో పూర్తయినా విద్యుత్, తాగునీటి వసతి కల్పించాల్సి ఉంది. గిరవెల్లి, కుంచవెల్లి, దహెగాంలోని భవన నిర్మాణాలు చివరి దశకు చేరినా చిన్నపాటి పనులు చేయాల్సి ఉంది.

సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం..

ప్రతీ సబ్‌సెంటర్‌లో ఆయుష్మాన్ భారత్ కింద ప్రభుత్వం వైద్యులను కేటాయించింది. కాని వైద్యులు స్థానికంగా ఉండడానికి సబ్ సెంటర్ల భవనాలు లేక ఇతర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు మలేరియా, టైఫాయిడ్, వాంతులు, విరేచనాలు వంటివి సోకే ప్రమాదం ఉంది. వైద్యులు స్థానికంగా ఉంటే రోగులకు ఎల్లవేళలా వైద్యం అందించే అవకాశం ఉంటుంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మండలంలో సబ్‌సెంటర్ల నిర్మాణాలు పూర్తిచేయాలని మండలవాసులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

మండలంలో ఏడు సబ్ సెంటర్ల నిర్మాణాలకు ఎన్‌హెచ్‌ఎం కింద ఒక్కో భవనానికి రూ.20 లక్షలు మంజూరయ్యాయి. అన్ని చోట్ల పనులు ప్రారంభించాం. సబ్ సెంటర్ల నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేసి వీలైనంత త్వరగా ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటాం.

– అంజయ్య, డీఈ, ఎన్‌హెచ్‌ఎం

జెడ్పీ వైస్‌చైర్మన్ ఆర్థిక సాయం

కాగజ్‌నగర్‌టౌన్: పాము కాటుకు గురై కాగజ్‌నగర్ పట్టణం ఎల్లాగౌడ్ తోటలోని పీహెచ్‌సీలో చికిత్స పొందుతూ పెంచికల్‌పేట్ మండలం ఆగరగూడ గ్రామానికి చెందిన ధన్నూరి రాజన్న బుధవారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న జెడ్పీ వైస్‌చైర్మన్ కోనేరు కృష్ణారావు ఆస్పత్రికి చేరుకొని భౌతిక కాయాన్ని సందర్శించారు. బాధిత కుటుంబ సభ్యులకు రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట పూజరి వెంకన్న, మారయ్య, నాయకులు తదితరులు ఉన్నారు.

నేటి నుంచి 'ఉపాధి' గ్రామసభలు

కెరమెరి: గురువారం నుంచి ఈనెల 23 వరకు ఉపాధిహామీ గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఉపాధిహామీ పథకం ఏపీవో మల్లయ్య ఒక ప్రకటనలో తెలిపారు. 17న రింగన్‌ఘాట్, 18న కొఠారి, అనార్‌పల్లి, గోయగాం, నిసాని, ధనోరా, బొరిలాల్‌గూడ, ఝరి, భోలాపటార్, సావర్‌ఖెడా, మోడి, 19న కెలిబి, కరంజివాడ, ఖైరీ, ఆగర్‌వాడ, 20న పార్డ, 21న సాకడ, ముకందగూడ, 22న, కెరమెరి, బాబేఝరి, పరందోళి, కెస్లాగూడ, దేవాపూర్, సాంగ్వి, సుర్దాపూర్, మెట్టపిప్రి, తుమ్మగూడ, అంతాపూర్, ఇందాపూర్, గోండ్‌గూడ, జోడేఘాట్ గ్రామ పంచాయతీల్లో నిర్వహిస్తామని పేర్కొన్నారు. అధికారులు అందుబాటులో ఉండాలన్నారు.

కెరమెరికి చేరిన క్రీడా సామగ్రి

కెరమెరి: మండలంలోని 31 గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలకు పంపిణీ చేసే క్రీడా సామగ్రి మండల కేంద్రానికి చేరింది. వీటిలో క్రికెట్ కిట్లు 94, వాలీబాల్ 94, సైకిల్ పంప్ 94, డంబెల్స్ 94, టెన్నికైట్స్ (రింగ్స్) 94, స్కిప్పింగ్ రోప్ 94, ప్లాస్టిక్ విజిల్ 94, టీషర్టులు 7050 వచ్చాయని, వీటిని త్వరలో పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో మహేందర్ తెలిపారు.

క్లుప్తంగా

పరామర్శ

ఆసిఫాబాద్: రెబ్బెన మండలం రాంపూర్ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఎంఐఎం పట్టణ ప్రధాన కార్యదర్శి కుటుంబ సభ్యులను పీసీసీ సభ్యుడు డాక్టర్ గణేశ్ రాథోడ్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిలో పరామర్శించారు. ఆయన వెంట పార్టీ నాయకులు ఇస్మాయిల్, గద్దల సత్యనారాయణ, శంకర్ ఉన్నారు.

రుణాలు సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న జెడ్పీటీసీ నాగేశ్వర్ రావు

ఆసిఫాబాద్: తెలంగాణ ప్రభుత్వం మహిళలకు అందించే డ్వాక్రా రుణాలు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్ రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఏఎంసీ యార్డు ఆవరణలో బుధవారం ఎంపీపీ అరిగెల మల్లికార్జున్‌తో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళల సంక్షేమం కోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వం తోడ్పడుతుందని, రుణాలు సకాలంలో పొందాలన్నారు. ఈ సందర్భంగా మహిళా సంఘాల సభ్యుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అంకుసాపూర్ సర్పంచ్ బలరాం, సుధాకర్, శ్రీనివాస్, సరస్వతి, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కౌటాల: కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూర్ మండలాలకు గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని కౌటాల ఏడీఈ రాజేశ్వర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సిర్పూర్(టి) 33కేవీ లైన్ కౌటాల-సిర్పూర్(టి)లో నేడు మరమ్మతులు, మెయింటనెన్స్ పనులు చేయనున్నట్లు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు పేర్కొన్నారు.

సీసీ రోడ్లకు నిధులు మంజూరు చేస్తాం

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని టీఆర్‌నగర్‌లో రోడ్ల నిర్మాణానికి అవసరమయ్యే నిధులు మంజూరు చేయిస్తానని ఎంపీపీ అరిగెల మల్లిఖార్జున్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పలు కాలనీలను సందర్శించారు. కాలనీవాసులు మాట్లాడుతూ టీఆర్‌నగర్‌లో రోడ్డు అధ్వానంగా ఉండడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. సమస్యలపై స్పందించిన ఎంపీపీ నిధుల మంజూరుకు కృషి చేస్తానన్నారు. నాయకులు ఆవిడపు ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ తనిఖీ



కేజీబీవీలో భోజనాన్ని పరిశీలిస్తున్న స్వర్ణ

దహెగాం: మండల కేంద్రంలోని స్థానిక కేజీబీవీని బుధవారం సెక్టోరియల్ అధికారి స్వర్ణ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థినులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలని ఆదేశించారు. నూతన సిబ్బంది బోధన తీరును పరిశీలించారు. ఆమె వెంట ఎస్‌వో రిజ్వాన, సిబ్బంది ఉన్నారు.

సాక్షి సినిమాలు

ఆసిఫాబాద్

కుమురంభీం : జైలర్

కాగజ్‌నగర్

వెంకటరమణ : జైలర్

- ఆసిఫాబాద్‌అర్బన్

కూరగాయల ధరలు

కూరగాయలు	ధర(కిలో)
టమాటా	రూ.100
సిమ్లామిర్చి	80
దోసకాయ	60
చామగడ్డ	80
వంకాయ	60
బీరకాయ	100
కాకరకాయ	80
బెండకాయ	60
అలసంద	60
దొండకాయ	80
పచ్చిమిర్చి	100
పాలకూర	60
సోరకాయ	60
చిక్కుడు కాయ	100
గోబి(పూల్)	100
క్యాబేజి	60

-ఆసిఫాబాద్‌అర్బన్

మెరుగైన రవాణా సౌకర్యం కల్పించడమే లక్ష్యం



కాపీలు అందజేస్తున్న ఎమ్మెల్యే కోనప్ప

కౌటాల: గ్రామీణ ప్రాంతాలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని సిర్పూర్(టి) ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఆయన నివాసంలో నాయకులకు రోడ్డు మంజూరు జీవో కాపీలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ సిర్పూర్(టి) నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో రహదారుల నిర్మాణాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.18.05 కోట్ల నిధులు విడుదల చేసిందన్నారు. కౌటాల మండలంలోని బాలేపల్లి, తాటిపల్లి, మొగడ్‌దగడ్ గ్రామాలకు బీటీ రోడ్లు మంజూరైనట్లు తెలిపారు. డీసీఎంఎస్ వైస్‌చైర్మన్ కుమురం మాంతయ్య, చింతలమానెపల్లి ఎంపీపీ డబ్బుల నానయ్య, ఎంపీటీసీ మనీష్, పార్టీ మండలాధ్యక్షుడు ఆదే వసంత్‌రావు, పార్టీ యూత్ మండలాధ్యక్షుడు రవీందర్‌గౌడ్, సర్పంచ్ మౌనిశ్, నాయకులు మధుకర్, భూషన్, ఆనంద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

షీటీం సేవలపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ సురేశ్

ఆసిఫాబాద్‌రూరల్: విద్యార్థుల రక్షణ కోసం షీ టీం పని చేస్తుందని సీఐ సురేశ్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థులకు షీ టీంపై అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ మహిళలపై హింస, ఈవ్‌టీజింగ్, సైబర్‌క్రైమ్‌కు గురైతే వెంటనే షీ టీం నంబర్ 8712670564 లేదా 100కు కాల్ చేయాలన్నారు. ఈసందర్భంగా కళా బృందం ఆధ్వర్యంలో మూఢనమ్మకాలు, రోడ్డు భద్రత, వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్, షీ టీం సిబ్బంది సునీత, స్వప్న తదితరులు ఉన్నారు.

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి, బస్టాండ్‌లలో బుధవారం షీటీం బృందం ప్రజలకు అవగాహన కల్పించారు. షీటీం ఇన్‌చార్జి శ్రీనివాస్ ఆధ్వర్యంలో షీటీం బృందం సభ్యులు పలు అంశాలపై అవగాహన కల్పించారు. డయల్ 100 సేవలు, షీ టీం సేవలపై వివరించారు.

'గృహలక్ష్మి' ఎంపికపై పరిశీలన



ఆగర్‌వాడలో పత్రాలు పరిశీలిస్తున్న ఎంపీడీవో

కెరమెరి: గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకున్న వారి నుంచి అర్హుల ఎంపిక కోసం బుధవారం ఎంపీడీవో మహేందర్ క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు. మండలంలో మొత్తం మొత్తం 4163 దరఖాస్తులు రాగా అర్హుల ఎంపికకు సాంగ్వి, కెలిబి, ఖైరీ, ఆగర్‌వాడ, గోండ్‌గూడ, ఇందాపూర్ గ్రామ పంచాయతీల్లో పర్యటించినట్లు ఎంపీడీవో తెలిపారు. పరిశీలన అనంతరం నివేదికను ఉన్నతాధికారులకు పంపించనున్నట్లు పేర్కొన్నారు.

వర్గీకరణ కోసం పోరాటానికి సిద్ధం కావాలి

బెల్లంపల్లి: వర్గీకరణ సాధన కోసం మాదిగ విద్యార్థులు పాలకులపై పోరాటానికి సిద్ధం కావాలని మాదిగ విద్యార్థి ఫెడరేషన్(ఎంఎస్‌ఎఫ్)జాతీయ అధ్యక్షుడు సీహెచ్.సోమశేఖర్ అన్నారు. బెల్లంపల్లిలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పాలకులు మాదిగలను ఓటు బ్యాంకుగా వినియోగించుకుంటున్నాయన్నారు. హైదరాబాద్‌లో జరిగే సభకు విద్యార్థులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. వర్గీకరణతోనే జీవితాలు బాగుపడతాయని పేర్కొన్నారు.

నేడు ఆయుర్వేద వైద్య శిబిరం

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలోని సీఈఆర్ క్లబ్ ఆవరణలో గురువారం ఉదయం పది గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు ఆయుర్వేద వైద్య శిబిరం ఉంటుందని ఏరియా పీఎం శ్యాంసుందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆయుర్వేద వైద్యులు విశ్వనాథ మహర్షి అందుబాటులో ఉంటారని, దీర్ఘకాలిక వ్యాధులున్నవారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పీఎం పేర్కొన్నారు.

'మర్కొళ్ల' హడావుడి



కెరమెరి: మండలంలోని గిరిజన గ్రామాల్లో మర్కొళ్ల హడావుడి ప్రారంభమైంది. జామురావుస్ (శ్రావణమాసం ప్రారంభం) పండుగ పురస్కరించుకొని పొలాల అమావాస్య తర్వాత నిర్వహించే బడిగ పండుగ వరకు ఆయా గ్రామాల్లో యువకులు, పిల్లలు వెదురుతో తయారు చేసిన కర్రల ఆసరాతో నడుస్తుంటారు. బుధవారం చౌపన్‌గూడ గ్రామంలో వెదురు కర్రలపై నడుస్తూ యువకులు, పిల్లలు సందడి చేశారు.

ప్రభుత్వం పీఆర్సీ ప్రకటించాలి

కౌటాల: రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉద్యోగ, ఉపాధ్యాయులకు పీఆర్సీ, తక్షణమే 30శాతం ఐఆర్ ప్రకటించాలని పీఆర్‌టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు ఏటుకూరి శ్రీనివాస్‌రావు అన్నారు. బుధవారం మండలంలోని వీర్దండి, కౌటాల, గుండాయిపేట్, మొగడ్‌దగడ్ గ్రామాల్లో ఉపాధ్యాయులకు సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. సభ్యులు కమలాకర్, రాజు, గణపతి, మార్త రమేశ్, ప్రకాశ్, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీలు, పదోన్నతులు వెంటనే చేపట్టాలి

కాగజ్‌నగర్‌టౌన్: ఉపాధ్యాయుల బదిలీ పదోన్నతుల ప్రక్రియను వెంటనే చేపట్టాలని పీఆర్టీయూఎస్ మండల శాఖ అధ్యక్షుడు భిక్షపతి డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల (కొత్త)లో పీఆర్టీయూఎస్ మండల శాఖ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న బ్యాంక్ మేనేజర్

ఆసిఫాబాద్‌రూరల్: మండలంలోని కొటన్ మోవాడ్ గ్రామానికి చెందిన రాధాబాయి మృతి చెందగా ఆమె భర్త నాగోరావుకు బీమా పరిహారం రూ.2 లక్షల చెక్కును బుధవారం తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ విశ్వనాథం అందజేశారు. ఆయన మాట్లాడుతూ రాధాబాయి ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా యోజన పథకంలో చేరి సంవత్సరానికి రూ.436 చెల్లించిందన్నారు. రైతులు పీఎంఎస్‌బీవై, పీఎంజేజేబీవై వంటి పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది తదితరులు ఉన్నారు.

రైతుబీమా చెక్కు పంపిణీ

చింతలమానెపల్లి: మండలంలోని లంబాడిహేటి గ్రామానికి చెందిన జరుపుల నిర్మలకు ఎంపీపీ డుబ్బుల నానయ్య బుధవారం రైతుబీమా చెక్కు పంపిణీ చేశారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ మాట్లాడుతూ రైతులు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఎంపీటీసీ ధన్‌రాజ్, కోఆప్షన్ సభ్యులు నాజింహుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని మంత్రికి వినతి

నార్నూర్: మండలంలోని గుండాల గ్రామంలో సమస్యల పరిష్కారానికి ప్రత్యేక నిధులు కేటాయించాలని బుధవారం హైదరాబాద్‌లోని ఆర్థిక, ఆరోగ్య శాఖ మంత్రి హరీష్‌రావును బుధవారం గ్రామానికి చెందిన యువకుడు రాథోడ్ సురేశ్ కలిసి వినతిపత్రం అందజేశారు. ఎస్సీలకు రైతుబంధు, రైతు భీమా, రుణమాఫీ వంటి పథకాలు అందడం లేదన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

భీమారం: ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతీ విద్యార్థి సైబర్ నేరాల గురించి తెలుసుకోవాలని ఎస్సై రాజవర్ధన్ అన్నారు. పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ స్మార్ట్ ఫోన్లు వినియోగిస్తున్నారని, అందులో వచ్చే మెసేజ్ లింక్‌లను ఓపెన్ చేయొద్దని తల్లిదండ్రులకు తెలపాలన్నారు. బ్యాంకు అధికారుల పేరుతో వచ్చే ఫోన్‌కాల్స్‌కి వెంటనే స్పందించి, వ్యక్తిగత వివరాలు అందించొద్దన్నారు. సోషల్‌మీడియా ద్వారా తప్పుడు ప్రచారం చేయొద్దని కోరారు. బాలికలపై ఎవరైన అసభ్యంగా ప్రవర్తిస్తే, వెంటనే 100కాల్ చేసి ఫిర్యాదు చేయాలని కోరారు. ఇందులో ఉపాధ్యాయులు శ్రీనివాస్, శ్రీమూర్తి, వేణుగోపాల్, రవీందర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్, బ్యాగులు పంపిణీ



బ్యాగులు పంపిణీ చేస్తున్న నాయకులు

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత ఉర్దూ, తెలుగు మీడియం పాఠశాలల విద్యార్థులకు బుధవారం ఆల్ ఇండియా ఐడల్ టీచర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మండల కోఆప్షన్ సభ్యుడు కిజర్‌హుస్సేన్, స్కూల్ కమిటీ చైర్మన్ ఇఫాత్‌హుస్సేన్‌ల చేతుల మీదుగా నోట్‌బుక్స్, బ్యాగులు, పెన్నులు ఉచితంగా పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయులు రోజారాణి, ఏఐఐటీఏ సిర్పూర్(టి) యూనిట్ అధ్యక్షుడు అజీజ్‌ఖాన్, ఉపాధ్యాయులు బారిక్‌రావ్, పాల్గొన్నారు.

'బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి'



మాట్లాడుతున్న మోర్చా అధ్యక్షురాలు వందన



రాస్తారోకో చేస్తున్న బీజేపీ నాయకులు

బెజ్జూర్: భారతీయ జనతా పార్టీ బలోపేతానికి ప్రతీ ఒక్కరు కృషి చేయాలని మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు కొమరం వందన అన్నారు. బుధవారం మండలంలో బీజేపీ మహిళ మోర్చా మండల కమిటీలను సమన్వయం చేశారు. ఆమె మాట్లాడుతూ మహిళలు ముందంజలో నడవాలన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు బాలకృష్ణ యాదవ్, మహిళ మోర్చా ప్రధాన కార్యదర్శులు రాణి, కుసుమ, విజయ, మండల ప్రధాన కార్యదర్శి సపవత్, బిక్షపతి, జనార్ధన్, శ్రీను, మహేష్, సాయిలత, రేణుక, పాడిగెల స్వాతి, సరిత, పద్మ లక్ష్మి, స్వప్న పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో రాస్తారోకో

దహెగాం: బీఆర్‌ఎస్ ప్రభుత్వం వైఫల్యాలకు నిరసనగా బుధవారం మండల బీజేపీ ఆధ్వర్యంలో రాస్తారోకో చేపట్టారు. బీజేపీ మండల అధ్యక్షుడు రాపర్తి ధనుంజయ్ మాట్లాడుతూ మూడేళ్లుగా వరదలతో పంట నష్టం జరుగుతున్నా పరిహారం చెల్లించకుండా ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. బీజేపీ ఓబీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పుల్లం నారాయణ, జిల్లాకార్యదర్శి మల్లేశ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు పడాల సురేశ్, సహకార సంఘం చైర్మన్ కోంద్ర తిరుపతి గౌడ్, నాయకులు ఎల్కరి దామోదర్, తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం'



మాట్లాడుతున్న శేషారావు

కెరమెరి: కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని పార్టీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు రాథోడ్ శేషారావు అన్నారు. బుధవారం మండలంలోని కొలాం కొఠారి గ్రామాన్ని సందర్శించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం రైతు డిక్లరేషన్ గురించి వివరించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రూ.2 లక్షల రుణమాఫీ, పోడు భూములకు పట్టాలు, ఇందిరమ్మ ఇంటికి రూ.5 లక్షల సాయం, కౌలు రైతుకు ఎకరాకు రూ.15 వేలు, వచ్చిన మొదటి ఏడాదికే 2 లక్షల ఉద్యోగాల భర్తీ వంటి అంశాలపై వివరించారు. నాయకులు సోమన్న, భీంరావు, రవినాయక్, సాగర్ తదితరులు ఉన్నారు.

పోలీసుల ఆధ్వర్యంలో రోడ్డు మరమ్మతులు



రోడ్డుకు మరమ్మతులు చేయిస్తున్న ఎస్సై

దహెగాం: మండలంలో గిరిజన గ్రామం లోహా రోడ్డు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు అధ్వానంగా మారడంతో బుధవారం పోలీసుల ఆధ్వర్యంలో మరమ్మతులు చేపట్టారు. రోడ్డు సౌకర్యం లేక గిరిజనులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో రోడ్డుకు మరమ్మతులు చేపట్టినట్లు ఎస్సై సనత్‌కుమార్ పేర్కొన్నారు. గ్రామ సమీపంలో ఉన్న చెక్ డ్యాం కట్టకు సైతం మరమ్మతులు చేశామన్నారు.